

మధ్యాహ్న భోజన కార్మికుల మెనూ బిల్లు పెంచాలి

దెందులూరు: మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే మెనూ బిల్లు, వేతనాలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. శనివారం దెందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కె.లక్ష్మి అధ్యక్షతన జరిగిన మధ్యాహ్న భోజన కార్మికుల మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎంతో కష్టించి తమ సొంత బిడ్డల్లా పాఠశాలలోని పిల్లలకు శుభ్రమైన భోజనం వండి పెడుతున్నారని, అలాంటి వారిపట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్కీం వర్కర్లందరూ పెద్ద ఎత్తున పాల్గొని సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ఆందోళనలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కె.లక్ష్మి, కార్యదర్శిగా వెంకటేశ్వరమ్మ, కోశాధికారిగా సరస్వతి, మొత్తం ఆరుగురితో కమిటీ ఎన్నికైంది.


సర్రాజు ఇక లేరు

గుండెపోటుతో ఆకస్మిక మృతి

భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన సిఎం జగన్,


మంత్రులు, ఎంఎల్ఎలు, రాజకీయ ప్రముఖులు

భీమవరం నుంచి జక్కరం వరకూ అంతిమ యాత్ర



సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సిఎం జగన్





సర్రాజు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - భీమవరం, భీమవరం రూరల్

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్, ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు (70) గుండెపోటుతో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. ఓ ఫంక్షన్‌కు హాజరై శుక్రవారం రాత్రి భీమవరంలోని ఇంటికి చేరుకున్న సర్రాజు కొద్దిసేపటికి అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబీకులు ఆయనను హుటాహుటీన వర్మ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సర్రాజు మృతి చెందినట్లు నిర్ధారించారు. సర్రాజుకు భార్య అన్నపూర్ణమ్మ, పెద్ద కుమారుడు పాతపాటి శ్రీనివాసరాజు (వాసు), చిన్న కుమారుడు పాతపాటి యుగంధర్‌వర్మ (వర్మ) ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి భీమవరంలోని సర్రాజు నివాసానికి విచ్చేసి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. వైసిపికి చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, రాజకీయ ప్రముఖులు, సిపిఎం, టిడిపి, జనసేన, బిజెపి నేతలు సర్రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఉండి, భీమవరం నియోజకవర్గాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వేలాదిగా తరలొచ్చారు.

1953లో పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం జక్కరం గ్రామంలో సర్రాజు జన్మించారు. కోపల్లె సహకార సంఘం అధ్యక్షునిగా, ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పని చేశారు. 2004లో ఉండి ఎంఎల్ఎగా గెలుపొంది నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజానీకానికి ఎనలేని సేవలందించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2021లో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులై రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం వైసిపి పోలవరం నియోజకవర్గ పరిశీలకుని బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు.

సర్రాజు మృతి పట్ల సిఎం జగన్ సంతాపం

భీమవరంలో పాతపాటి సర్రాజు నివాసానికి శనివారం మధ్యాహ్నం చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సర్రాజు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. సర్రాజు మృతి వార్త తెలియగానే జగన్ శనివారం ఉదయం ఫోన్లో సర్రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సిఎం భీమవరం రానున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో నేతలు, ఉన్నతాధికారులు హుటాహుటీన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పెదఅమిరంలో హెలీప్యాడ్ ఏర్పాటు పనులను శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ పరిశీలించారు. హెలీకాప్టర్లో పెదఅమిరం చేరుకున్న జగన్ అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా భీమవరంలోని సర్రాజు స్వగృహానికి 2.37 గంటలకు చేరుకున్నారు. సర్రాజు భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం సర్రాజు కుమారులు వాసు, వర్మలతో మాట్లాడి ఏం జరిగిందని ఆరా తీశారు. మూడు నెలల క్రితం సర్రాజు తన వద్దకు వచ్చారని, అప్పుడు బాగానే ఉన్నారని, ఇంతలోనే ఏమైందని విచారం వ్యక్తం చేశారు. అనంతరం సర్రాజు భార్య, కుటుంబ సభ్యులను పరామర్శించి 2.49 గంటలకు అక్కడ నుంచి బయల్దేరి పెదఅమిరంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలీకాప్టర్‌లో విజయవాడ బయల్దేరి వెళ్లారు.

భీమవరం నుంచి జక్కరం వరకు అంతిమయాత్ర

సర్రాజు అంతిమయాత్ర భీమవరంలోని స్వగృహం నుంచి స్వగ్రామం జక్కరం వరకూ సాగింది. జక్కరంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సిఎం జగన్‌కు వినతిపత్రం అందించిన సర్రాజు కుటుంబ సభ్యులు

సర్రాజు కుటుంబ సభ్యులు సిఎం జగన్‌కు వినతిపత్రం అందజేశారు. సర్రాజు ఎంఎల్‌సి పదవి ఆశించారని, శుక్రవారం ఒక ఫంక్షన్‌కు వెళ్లొచ్చిన ఆయన ఇంటికొచ్చాక ఎక్కువ సేపు దీనిపై ఆలోచించారని కుటుంబ సభ్యులు జగన్‌కు వివరించినట్లు సమాచారం. ఒక ఇంటెలిజెన్స్ అధికారితో ఎంఎల్‌సి పదవి కేటాయింపు గురించి మాట్లాడి తెలుసుకున్నారని, కొద్దిసేపటి తర్వాత తనకు నిద్ర పట్టడం లేదని చెప్పారని, అనంతరం టీవీలో పాటలు చూశారని, కొద్దిసేపటికి అస్వస్థతకు గురవడంతో హుటాహుటీన వర్మ ఆసుపత్రికి తీసుకెళ్లామని చెప్పారని తెలిసింది. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి జగన్ సర్రాజు కుమారుడు వాసు ఉన్నారుగా, ఇంకా సమయం ఉంది అని సర్రాజు కుటుంబ సభ్యులకు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కుటుంబ సభ్యులు సిఎంకు ఒక వినతిపత్రం అందజేసినట్లు సమాచారం. దానిలో ఏముందో తెలియరాలేదు. దీనిపై స్థానికంగా విస్తృత చర్చ సాగుతోంది.

సర్రాజు మృతి పట్ల సిపిఎం సంతాపం

ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు మృతి పట్ల సిపిఎం సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ సర్రాజు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎల్ఎగా సర్రాజు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రాజకీయ ప్రముఖులు, జిల్లా అధికారులు సంతాపం

సర్రాజు మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖులు, జిల్లా అధికారులు సంతాపం తెలిపారు. వైసిపితోపాటు సిపిఎం, టిడిపి, జనసేన, బిజెపి నేతలు, నాయకులు, జిల్లా అధికారులు సర్రాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దాడిశెట్టి రాజా, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్, డిఐజి పాలరాజు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, ఎస్‌పి యు.రవిప్రకాష్, ఆర్‌డిఒ దాసి రాజు, ఎంఎల్ఎలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, దూలం నాగేశ్వరరావు, మాజీ మంత్రులు పేర్ని వెంకట్రామయ్య (నాని), చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఎంబిసి ఛైర్మన్ పెండ్ర వీరన్న, సువార్తికులు బ్రదర్ అనిల్‌కుమార్, మాజీ ఎంఎల్‌సిలు మేకా శేషుబాబు, బొమ్మిడి నారాయణరావు, నేతలు గోకరాజు రామం, వంకా రవీంద్ర, యడ్ల తాతాజీ, గూడూరి ఉమాబాల, మేడిది జాన్సన్, గాయకుడు గజల్స్ శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎలు పులపర్తి రామాంజనేయులు, వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాష్‌రాజు ఉన్నారు.

కాళ్ల: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు (70) సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. రాజకీయాల పట్ల ఆసక్తితో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈయన స్వగ్రామం కాళ్ల మండలం జక్కరం. 2006లో జక్కరం నిర్మల్ పురస్కార్ అవార్డు సాధించేందుకు అహర్నిశలు కృషి చేశారు. ఆయన మరణంతో జక్కరం గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు పర్యవేక్షణలో సర్రాజు భౌతికకాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.


ఆప్త మిత్రుడిని కోల్పోయా : భీమవరం ఎంఎల్ఎ గ్రంధి


భీమవరం రూరల్: పాతపాటి సర్రాజు భౌతికకాయాన్ని సందర్శించిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ కన్నీటిపర్యంతమయ్యారు. రోజులో ఏదోక సందర్భంలో ఇద్దరం మాట్లాడుకునే వాళ్లమని గ్రంధి చెప్పారు. సర్రాజు, తాను ఒకేసారి అసెంబ్లీలో అడుగుపెట్టామన్నారు. ఆయన మరణం పార్టీకి, ప్రజలకు, తనకు తీరని లోటన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సర్రాజు ఎనలేని కృషి


అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో సర్రాజు ఉండి ఎంఎల్ఎగా నియోజకవర్గంలో సుమారు రూ 800 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. ఇల్లు నిర్మించుకునే పేదవానికి ఉచితంగా లారీ ఇసుక అందించారు. పంట, మురుగు కాలువల ఆధునికీకరణ పనులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. కాళ్లలో బిసి ఇంటిగ్రేటెడ్ బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేశారు. ఆకివీడులోని తాళ్లకోడులో ఇళ్ల స్థలాల కోసం 74 ఎకరాలు భూసేకరణ చేపట్టారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత వైసిపి ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి 2014 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.







నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంఎల్ఎలు వాసుబాబు, మంతెన రామరాజు



సిపిఎం నేతలు బలరాం, గోపాలన్

మృత్యుఘంటికలు

పూళ్లలో ఆర్‌టిసి బస్సు ఢీకొని ముగ్గురు దుర్మరణం

పట్టిసీమలో గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

శివరాత్రి ఉత్సవాల్లో జనం నిమగ్నమై ఉండగా జిల్లాలో మృత్యుఘంటికలు మోగాయి. వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు మృత్యువాతపడ్డారు. ఆర్‌టిసి బస్సు ఢీకొని ముగ్గురు భవన నిర్మాణ కార్మికులు, గోదావరి గల్లంతై మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం అలముకుంది. బంధువుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.



నుజ్జయిన ద్విచక్ర వాహనం

బస్సుకింద వాహనం

పూళ్లలో మృతిచెందిన కార్మికులు

భీమడోలు: మృత్యువు ఎటువైపు నుంచి ఎలా ముంచుకొస్తుందో ఎవరూ ఊహించలేరు.. ఈ తరహాలోనే రోడ్డు పక్కన నిలబడి మాట్లాడుకుంటున్న భవన నిర్మాణ కార్మికులపైకి ఆర్‌టిసి బస్సు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ముగ్గురి ప్రాణాలను కబళించింది. ఈ విషాద ఘటన జాతీయ రహదారిపై భీమడోలు మండలం పూళ్ల వద్ద శనివారం మధ్యాహ్నం జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవ్వగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దండ్రు వీరాస్వామి(30), కర్నాటి మహేంద్ర(33), ఊటకూరి ఫణీంద్ర(27), గండికోట శ్రీను భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఇంటి నిర్మాణాలకు అవసరమైన గుమ్మాలు కొనేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై పూళ్ల వెళ్లారు. గుమ్మాలు కొనుగోలు విషయమై పూళ్ల వద్ద రోడ్డుపై ఆగి చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో ఒకరి బండిలో పెట్రోల్ అయిపోవడంతో మరో వాహనంలోని పెట్రోలు తీసి నింపుకుంటున్నారు. ఈ సమయంలో భీమవరం నుంచి భీమడోలు మీదుగా చింతలపూడి వెళ్తున్న భీమవరం డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు రోడ్డు పక్కన ఉన్న వీరిపైనుంచి దూసుకెళ్లింది. ఈ ఘటనలో వీరాస్వామి, మహేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన ఫణీంద్రను, గండికోట శ్రీనును 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఫణీంద్ర మృతిచెందాడు. గండికోట శ్రీను ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ అతివేగంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళన

నిర్లక్ష్యంగా ఆర్‌టిసి బస్సు నడిపి ముగ్గురు మృతికి కారణమయ్యారని, తక్షణం వారి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరుతూ కురెళ్లగూడెం గ్రామస్తులు పూళ్ల వద్ద రాస్తారోకో చేపట్టారు. దీంతో రహదారిపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు, అధికారులు బాధితులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం ఆందోళన విరమించారు.

పోలవరం: వారంతా పట్టిసీమ ఉత్సవాల్లో ఆనందంగా గడుపుదామని వచ్చారు. గోదావరి ఇసుక తిన్నెల్లో ఉల్లాసంగా కలయతిరిగారు. గోదావరిలో స్నానాలు చేసి ఆలయానికి వెళదామనుకున్నాను.. ఇంతలో ఓ ప్రమాదం ముగ్గురిని కబళించింది. వారి కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. అధికారులు ఏర్పాటు చేసిన స్నానరేవులు రద్దీగా ఉండటంతో సమీపంలోని అనధికార రేవులో స్నానం చేసేందుకు దిగిన ముగ్గురు గోదావరిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు.



పట్టిసీమలో మృతులు

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల్లో శనివారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం దోసపాడు గ్రామానికి చెందిన ఓలేటి అరవింద్(20), ఎస్‌కె.లుక్మన్(19), పెద్దిరెడ్డి రామ్‌ప్రసాద్(18), మరో నలుగురు కలిసి మహాశివరాత్రి సందర్భంగా పోలవరం మండలం పట్టిసీమకు ఉదయం చేరుకున్నారు. ఉత్సవాల సందర్భంగా స్నానాల కోసం కేటాయించిన రేవుల్లో కాకుండా దూరంగా అనధికార రేవు వద్ద వీరు స్నానాలు చేసేందుకు వెళ్లారు. అక్కడ నదిలోతుగా ఉండటం, గోదావరి నీటి ప్రవాహం వేగంగా ఉండటంతో ముగ్గురు గల్లంతయ్యారు. ఒడ్డున ఉన్న స్నేహితులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. వారు అప్రమత్తమై గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోలవరం సామాజిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

పట్టిసీమకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు శనివారం యాత్రికులు పోటెత్తారు. గోదావరి నీటిమట్టం తక్కువగా ఉండడంతో అధికారులు, ఫెర్రీ కాంట్రాక్టర్లు గోదావరి నదిపై ఆరు పంట్లతో సుమారు 150 మీటర్ల మేర కాలిబాటను ఏర్పాటు చేశారు. యాత్రికులు దర్శనానికి వెళ్లేందుకు క్యూలైన్ల ద్వారా పరిమిత సంఖ్యలో నది దాటే విధంగా పోలీసుశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. నదీ తీరం నుండి ఆలయం వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర ఇసుక తిన్నెల్లో నడవడానికి గోనెసంచులతో కాలిబాటను ఏర్పాటు చేశారు. అయితే యాత్రికుల వాహనాలను ఫెర్రీ రేవుకు దూరంగా నిలిపివేయడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడవడానికి యాత్రికులు, వృద్ధులు, వికలాంగులు, పిల్లలు నానాఅవస్థలు పడ్డారు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంటకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు స్వామివారికి గోదావరిలో మంగళస్నానాలు చేయించి, తొలిపూజలు నిర్వహించారు. రెండున్నర గంటల నుండి ఆలయ దర్శనం ప్రారంభం కావడంతో దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో దేవాదాయశాఖ, పలు సేవా సంఘాలు, ఫెర్రీ రేవులో హుకుంపేట జమీందారు నిర్వహించిన యాత్రికులకు అన్నదానం చేశారు. సత్యసాయి సేవా సంఘం, తపన చౌదరి ట్రస్టు ఆధ్వర్యంలో యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను పలువురు వినియోగించుకున్నారు. ఈ ఏడాది స్వామివారి దర్శనానికి సుమారు మూడు లక్షల మంది యాత్రికులు వచ్చినట్లు ఆలయ కార్యదర్శి సంగమేశ్వర శర్మ తెలిపారు. పోలీస్‌శాఖ, ఎస్‌డిఆర్ఎఫ్, విపత్తులశాఖ యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా సేవలు అందించాయి. పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఆదివారం కూడా యాత్రికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో భద్రతా ఏర్పాట్లను మరింత పెంచారు. శనివారం సాయంత్రం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దంపతులు ఆలయాన్ని సందర్శించారు.



ఆలయంలో కలెక్టర్ దంపతులు

ఏలూరు కార్పొరేషన్‌లో అవినీతికి అడ్డుకట్ట వేయాలి : సిపిఎం

ఏలూరు: ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతికి అడ్డుకట్ట వేయాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పళెలం కిషోర్ విమర్శించారు. శనివారం స్థానిక పవర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో నగరశాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కార్పొరేషన్‌లో ఆశీల కాంట్రాక్టులు, భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు విషయం, జనన, మరణ నమోదు తదితర అంశాల్లో అవినీతి, అక్రమాల వెలుగులోకి వచ్చాయని గుర్తు చేశారు. తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ దుకాణాలను అద్దెకు ఇచ్చే విషయంలో భారీఅవినీతి వెలుగు చూసింన్నారు. దీనిపై పత్రికల్లో వార్తలు కూడా వస్తున్నాయని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండే దుకాణాలను అద్దెలకు ఇచ్చే విషయంలో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు. కార్పొరేషన్‌లో వన్ టౌన్ మెయిన్ మార్కెట్, పాత బస్టాండ్, ప్రభుత్వాసుపత్రి, ఫైర్ స్టేషన్ సెంటర్, కోర్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 400 వరకూ దుకాణాలున్నాయన్నారు. వాటిలో నిబంధనల ప్రకారం ఎస్‌సిలు 15 శాతం, ఎస్‌టిలు ఆరు శాతం, బిసిలకు మూడు శాతం కేటాయించాల్సి ఉన్నా, ఆ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్నారు. ఇలా సామాజి తరగతులకు కేటాయించాల్సిన దుకాణాలను క్షేత్రస్థాయిలో వేరే వారికి కేటాయిస్తున్నారని తెలిపారు. వైఎంహెచ్ఎ హాలు సమీపంలో ఒక దుకాణాన్ని నాయీబ్రాహ్మణులకు కేటాయించినట్లు రికార్డులో చూపించి. క్షేత్రస్థాయిలో మాత్రం వేరే ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలా సామాజిక తరగతులకు కేటాయింపులోనే కాకుండా సాధారణ దుకాణాల్లో కూడా ఇదే రకమైన పరిస్థితి ఉందన్నారు. అధికార పార్టీ చెందిన వారు రాజకీయ ప్రాబల్యంతో దుకాణాలను స్వాధీనం చేసుకుని ఆ తర్వాత వాటిని వేరే వాళ్లకు అధిక మొత్తానికి అద్దెలకు ఇవ్వడం పరిపాటిగా మారిందన్నారు.

వీడని ఉత్కంఠ..!

రెండో ఎంఎల్‌సి పదవిపై అధికార పార్టీలో రచ్చ

ఒకటి జయమంగళకు ఖాయమని ప్రచారం

రెండో ఎంఎల్‌సి పదవి కోసం నేతల్లో గట్టి పోటీ

ప్రముఖంగా గుణ్ణం, వంకా పేర్లు, జాబితాలో మరికొందరు

రేపు అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌సి పదవి నాకు కావాలంటే.. నాకు కావాలంటూ అధికార పార్టీ నాయకులు పోటీ పడుతున్నారు. ఈ నెల 23వ తేదీ నామినేషన్లకు చివరి రోజు కావడంతో ఆశావహులంతా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆశావహులంతా టిక్కెట్ కోసం అధినాయకత్వం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఒక పదవి బిసికి, మరో పదవి జనరల్‌కు ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే టిడిపికి చెందిన కైకలూరు మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణను వైసిపిలోకి ఆహ్వానించి ఎంఎల్‌సి పదవి ఇచ్చేందుకు అధినాయకత్వం సిద్ధమైంది. దీంతో బిసికి ఇస్తామన్న పదవిపై స్పష్టత వచ్చినట్లయ్యింది. మరో పదవికి సంబంధించి పలువురి మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ పదవి ఆశిస్తున్న నాయకులు ఉమ్మడి జిల్లాలో దాదాపు 15 మందికిపైగా ఉన్నారు. వీరంతా ఎంఎల్‌సి పదవి తమకే వస్తుందని చెబుతున్న పరిస్థితి నెలకొంది. దీనిలో ప్రముఖంగా పాలకొల్లుకు చెందిన గుణ్ణం నాగబాబు, తణుకుకు చెందిన వంకా రవీంద్ర పేర్లు విన్పిస్తున్నాయి. గుణ్ణం నాగబాబుకు దాదాపుగా ఎంఎల్‌సి పదవి ఖాయమైనట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అయితే గుణ్ణంకు పదవి ఇవ్వడాన్ని చాలా మంది నాయకులు వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. గుణ్ణం నాగబాబు 2019 ఎన్నికల ముందు వైసిపి నుంచి జనసేనలోకి వెళ్లి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేశారు. గుణ్ణం నాగబాబు పోటీ చేయకపోతే పాలకొల్లులో వైసిపి అభ్యర్థి గెలిచేవారని వైసిపి నేతల అభిప్రాయం. ఎన్నికల తర్వాత కొంతకాలానికి నాగబాబు మళ్లీ వైసిపిలో చేరారు. పార్టీ నుంచి వెళ్లిపోయి తిరిగొచ్చిన వ్యక్తికి ఏవిధంగా ఎంఎల్‌సి పదవి ఇస్తారని అంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో నరసాపురం ఎంపీగా వైసిపి నుంచి పోటీ చేసి ఆర్థికంగా వంకా రవీంద్ర తీవ్రంగా నష్టపోయారు. తనకే ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని ఆయన గట్టిగా పట్టుబడుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే డెల్టా ప్రాంతానికి అనేక కీలక పదవులు కట్టబెట్టారని, మెట్ట ప్రాంతానికి ఎంఎల్‌సి ఇవ్వాలని ఈ ప్రాంత నాయకులు పట్టుబడుతున్నారు. కమ్మ సామాజిక తరగతికి చెందిన నల్లజర్లకు చెందిన కారుమంచి రమేష్ ఎంఎల్‌సి పదవి కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తే మెట్ట ప్రాంతంలో నాలుగైదు నియోజకవర్గాల్లో పార్టీకి సానుకూలత వస్తుందనే అభిప్రాయం వైసిపిలో వ్యక్తమవుతోంది. గుణ్ణం నాగబాబు, వంకా రవీంద్ర, కారుమంచి రమేష్ పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే పదవి ఎవరిని వరిస్తుందోననేది సస్పెన్స్ నెలకొంది.

గుణ్ణంకు ఇస్తే పోటీనే అంటూ హెచ్చరికలు


గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌సి పదవి ఇస్తే తాము అంగీకరించబోమని, స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగుతామని పాలకొల్లుకు చెందిన మరో నాయకుడితోపాటు, ఆశావహులు అధిష్టానానికి తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. అదే జరిగితే పార్టీకి తీవ్ర ఇబ్బంది ఏర్పడే పరిస్థితి రానుంది. వైసిపి నుంచి రెబల్ అభ్యర్థి పోటీలోకి దిగితే ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. పదవి ఆశిస్తున్న వారిని అధిష్టానం ఏవిధంగా బుజ్జగిస్తుందో వేచిచూడాలి. సోమవారం ఎంఎల్‌సి అభ్యర్థుల జాబితాను వైసిపి ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అప్పటి వరకూ ఉత్కంఠ తప్పదని చెప్పొచ్చు.

పనులు త్వరగా పూర్తిచేయాలి

పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శనివారం ప రిశీలించారు. శనివారం ప్రాజెక్ట్ ప్రాంతానికి చేరుకున్న ఆయన ప్రాజెక్ట్ అధికారులు, ఇంజినీర్లతో కలిసి ఎగువ కాఫర్ డ్యామ్ , దిగువ కాఫర్ డ్యామ్ స్పిల్ వే, పవర్ హౌస్ నిర్మాణ ప్రాంతాలను సందర్శించారు. పనుల ప్రగతిని ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. కలెక్టర్తో పాటు జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదిరెడ్డి, మెగా ఇంజినీరింగ్ కంపెనీ ప్రతినిధి మురళి, ఇంజినీర్లు రామమోహన్, రెడ్డి, తహశీల్దార్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లింగరాజు

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమడోలు

ఆటల పోటీలు కార్మికుల్లో ఉత్సాహాన్ని పెంచుతాయని, గెలుపోటములకు అతీతంగా వారి మధ్య స్నేహ బంధాలు పెరిగేందుకు దోహదపడతాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు వేదికగా అంబర్పేట కేంద్రంగా పనిచేస్తున్న లిక్సిల్ ఇండియా కంపెనీ రెండు రోజులపాటు కార్మికులకు లిక్సిల్ ప్రీమియర్ లీగ్ పేర క్రికెట్ పోటీలను నిర్వహిస్తుంది. శనివారం ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమంలో లింగరాజుతో పాటు వైసిపి జిల్లా నాయకులు తుమ్మగుంట రంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిక్సిల్ కంపెనీ, మానవ వనరుల విభాగం హెడ్ లోకేష్ తమ సంస్థ ద్వారా చేపట్టిన కార్మికులకు క్రికెట్ పోటీల నిర్వహణ, ఇతర అంశాలను అతిథులకు వివరించారు. దీనిలో భాగంగా క్రికెట్ పోటీల్లో కంపెనీకి చెందిన కార్మికులు ఎనిమిది జట్లుగా పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం క్రీడాకారులను లింగరాజు పరిచయం చేసుకున్నారు.

20న ఎత్తిపోతల పథకం కాలువ పరిశీలన

ప్రజాశక్తి - చింతలపూడి

సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనలో భాగంగా ఈ నెల 20వ తేదీన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సారథ్యంలో సిపిఐ రాష్ట్ర బృందం చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ పరిశీలనకు వస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క సాగునీటి ప్రాజెక్టును కూడా నిర్మించలేదన్నారు. గతంలో, మధ్యలో ఆగిపోయిన ప్రాజెక్టుల విషయంలో కూడా కక్షపూరిత ధోరణితో ఏ ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదన్నారు. ఈ ప్రాజెక్టుల పరిశీలనకు సిపిఐ రాష్ట్ర బృందం ఈ నెల 13వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తుందని తెలిపారు. దానిలో భాగంగానే ఈ నెల 20వ తేదీన పోలవరం చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తుందని తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం


ప్రజాశక్తి - మండవల్లి

పిన్నమనేని కోటేశ్వరరావు ఎడ్యుకేషనల్ మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పిల్లల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ట్రస్ట్ ఛైర్మన్ వీరయ్య చౌదరి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తొమ్మిది గంటల నుంచి పిల్లల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో సంభవించే ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించే విధంగా ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుడివాడలోని ఉమా పిల్లల వైద్యశాలకు చెందిన డాక్టర్ రామకృష్ణ ప్రసాద్ పిన్నమనేని డాక్టర్ మాధవి పిన్నమనేనితోపాటు విజయవాడలోని రెయిన్బో హాస్పిటల్ అంకుర హాస్పిటల్కి సంబంధించిన వైద్యులు వైద్య సేవలు అందిస్తారని ఆయన తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని మండవల్లి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు



మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

ఇటుకల ఫ్యాక్టరీలో ఇటుకలు తయారు చేసేందుకు బురద మట్టిని ట్రాక్టర్తో తొక్కిస్తుండగా ప్రమాదవశాత్తూ ఆ ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తెలంగాణ రాష్ట్ర అశ్వారావుపేటకు చెందిన రమేష్(26) రెండేళ్ల క్రితం మండలంలోని గుడి పాడుకు వచ్చాడు. గుడిపాడులోని ఇటుకల ఫ్యాక్టరీలో ట్రాక్టర్ డ్రైవర్గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం ఆ ఫ్యాక్టరీలో ఇటుకలు తయారు చేసేందుకు బురద మట్టిని ట్రాక్టర్తో తొక్కిస్తుండగా ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రమేష్ మృతి చెందాడు. రమేష్కు ఇటీవల వివాహమైంది. గర్భవతిగా ఉన్న అతని భార్య రమేష్ మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలైన ఘటన మండలంలోని ముప్పినవారిగూడెం వద్ద శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామపురానికి చెందిన గుర్రం వంశి బైక్పై వెళ్తుండగా మార్గం మధ్యలో ముప్పినవారిగూడెం వద్ద ఎదురుగా కారు రావడంతో రహదారిపై గోతులు ఉండడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. బైక్ను తప్పించబోయి కారు చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వంశి గాయాలపాలయ్యాడు. కారు ముందు భాగం నుజ్జునుజ్జుఅయింది. గాయాలపాలైన వంశిని స్థానికులు బుట్టాయగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రహదారి

పూర్తిగా పాడైపోవడంతో ప్రమాదాలో చోటు చేసుకుంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. పెను ప్రమాదాలు సంభవించక ముందే అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పామాయిల్ ఫ్యాక్టరీ వ్యర్థాలు సేవించి గేదె మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న కలు షిత వ్యర్థ నీటిని తాగి గేదె మృతి చెందింది. బాధిత పాడి రైతు కొండపల్లి భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం... ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలోని పొలంలో ఉంటున్న కొండపల్లి భాస్కరరావుకు చెందిన గేదె మేత మేస్తూ పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి విడుదలవుతున్న కలుషిత వ్యర్థ నీటిని సేవించి మృతి చెందింది. గతంలో కూడా తనకు చెందిన మరో గేదె పామాయిల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే నీటిని తాగి మృతి చెందినట్లు భాస్కరరావు తెలిపారు. గేదె మృతి చెందడం వల్ల రూ.50 వేల వరకు నష్టపోయానని బాధిత పాడి రైతు కొండపల్లి భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నారు.

పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు


చింతలపూడిలో జోరుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం

అనుమతులు లేకుండానే ఫ్లాట్ల క్రయవిక్రయాలు

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఫ్లాట్ల విక్రయ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. ఈ క్రమంలో యథేచ్ఛగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. కొందరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తున్నారు. వీటిలో ఫ్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు. వ్యవసాయ భూమిని ఇతర అవసరాలకు అనుగుణంగా మార్పు చేయాలంటే ముందస్తు అనుమతి అవసరం. దీనికోసం పంచాయతీ మొదలు ఆర్డిఒ కార్యాలయం వరకు ఫైల్ నడవాల్సి ఉంది. అందుకు కొంత సొమ్ము చెల్లించి అనుమతి పొందిన తరువాత మాత్రమే వ్యవసాయ భూమిని మార్పు చేయాలి.



అక్రమ లే అవుట్ స్థలంలో కమిషనర్ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

మండల పరిధిలో పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే అనధికార లే అవుట్లు వేసి అమ్ముకుంటున్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రియల్ భూం సృష్టించడం, ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కి ఫ్లాట్లను విక్రయిస్తుండడం షరా మామూలే. వీరి అక్రమాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అదే క్రమంలో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు, నాయకులకు వరంగా కూడా మారుతోంది. మండల పరిధిలో అనేక గ్రామాల్లో వ్యవసాయ భూమిని ఇంటి స్థలాలుగా మార్పు చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారు. వీటిలో సగానికి కూడా ముందస్తు అనుమతులు లేవు.

స్థిరాస్తి వ్యాపారుల్లో చాలా మంది ఈ నిబంధనలు పాటించడం లేదు. నేరుగా ఇళ్ల స్థలాలను విక్రయిస్తున్నారు. విషయం తెలియని ప్రజలు స్థలాలను కొనుగోలు చేసి భవనాలు నిర్మిస్తున్నారు. కాగా మండలంలో చాలా చోట్ల అనుమతి లేని లేఅవుట్లు వేసి విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో పంచాయతీలకు, ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. పంచాయతీ అనుమతి లేకుండా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోకుండా రోడ్డు పక్కనే ఉన్న భూమిలో లేఅవుట్లు వేసి అమ్మడానికి సిద్ధమయ్యారు. ఓ ప్రయివేటు సర్వేయర్తో కొలతలు వేయించి ఫ్లాట్లు వేయిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో రియల్ వ్యాపారులు తమ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. దీంతో పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో వ్యవసాయ భూములు లే అవుట్లుగా మారుతాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

అక్రమ లేవుట్లను అడ్డుకున్న నగర పంచాయతీ కమిషనర్

చింతలపూడి నగర పంచాయతీలో అక్రమ లే అవుట్లను కమిషనర్ అడ్డుకున్నారు. గతంలో లే అవుట్ వద్ద బోర్డులు పెట్టించిన పట్టించుకోకుండా, మళ్లీ లే అవుట్లు వేయటంతో కమిషనర్ రాంబాబు అడ్డుకున్నారు. అక్రమ లే అవుట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

లే అవుట్లకు అనుమతులు తీసుకోలేదు
టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావు

చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో రెండు లే అవుట్లకు అనుమతులు తీసుకున్నారు. మిగతా లే అవుట్లకు ఎటువంటి అనుమతులు తీసుకోలేదు.

బుర్రకథ కళాకారుడు మామిళ్లపల్లి సుబ్బారావు మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సీనియర్ బుర్రకథ కళాకారులు మామిళ్లపల్లి సుబ్బారావు అకాల మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు, ఏలూరు జిల్లా నాయకులు టివిఎస్.రాజు సంతాపం తెలిపారు. మండలంలోని బొర్రంపాలెంలో జన్మించిన సుబ్బారావు చిన్నతనం నుంచి కళల పట్ల ఆసక్తితో బుర్రకథ కళాకారునిగా భక్తిరస భజన కళాకారునిగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి అనేకమంది యువకులను కళాకారులుగా తీర్చిదిద్దారని అదే గ్రామానికి చెందిన వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్, తిప్పర్తి వీర బ్రహ్మాచారి కొనియాడారు. తాము ఆయనకు ప్రియ శిష్యులమని తెలిపారు. సుదీర్ఘకాలం కళాజీవితం కొనసాగిస్తున్న ఆయన బొర్రంపాలెం నుంచి గుంటూరు జిల్లా గురజావోలులో నివాసం ఏర్పాటు చేసుకుని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల్లో సంగీత కచేరీలు, భజనలు చేస్తూ సుమారు రెండు దశాబ్దాలకు పైగా కుటుంబ సమేతంగా అక్కడే నివాసం ఉన్నారని తెలిపారు. ఇటీవల ఆయన జన్మస్థలమైన బొ



సుబ్బారావు (ఫైల్ఫొటో)

ర్రంపాలెం వచ్చి తన శిష్య బృందంతో ఆనందంగా గడి పారన్నారు. ఈ నెల 22వ తేదీన బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ వర్థంతి జరుపుకునే అంశంపై చర్చించామని 17వ తేదీ ఉదయం పది గంటలకు ఇదే అంశంపై ఫోన్లో మాట్లాడి పద్మశ్రీ నాజర్ వర్థంతి కార్యక్రమానికి తాను హాజరవుతానని తనతో అన్నారని టివిఎస్.రాజు అన్నారు. శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన సుబ్బారావు మతికి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్ఆర్.కృష్ణబాబు, వర్థమాన సినీ నటుడు తిరుపతి రమేష్ బాబు, సీనియర్ కోలాట కళాకారుని బొందలపాటి పద్మావతి, సాయన రాఘవమ్మ, ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సాయిన కనకరాజు, సామాజిక సేవా కార్యకర్త వీరమల్ల మధు, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు కంకిపాటి ఏసు పాదం, కంకిపాటి బుచ్చిబాబు, ముల్లగిరి అలెగ్జాండర్, పౌరాణిక రంగస్థల కళాకారులు తోట సత్యనారాయణ, తోట లక్ష్మీనారాయణ సంతాపం తెలుపుతూ వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

'ప్రజలను మోసగిస్తున్న వైసిపి'

ప్రజాశక్తి - చింతలపూడి

సంక్షేమం, అభివృద్ధి పేరుతో వైసిపి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా అన్నారు. పట్టణంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ప్రభాకరరావు, ముత్యాల గణేష్, క్లస్టర్ ఇన్ఛార్జి మన్యం సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

23న రజక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 23వ తేదీన రజక సంఘం జిల్లా మహాసభ ఏలూరులోని సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య శనివారం చెప్పారు. మొయ్యేరులో శనివారం నిర్వహించిన రజకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రజకులకు చెందిన చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. రజకులకు ఏర్పాటు చేసిన జిఒలు అమలు చేయాలని కోరారు. మహాసభలో రజకుల సమస్యలపై చర్చించి తీర్మానం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. 23న నిర్వహించే రజన సంఘం మహాసభకు రజకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల నాయకులు బుద్దారపు పుల్లయ్య, కె.సుబ్బయ్య, వీర్రాజు, సుబ్రహ్మణ్యం, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలివేకు లక్ష మందికి పైగా యాత్రికులు

ఘనంగా మహాశివరాత్రి ఉత్సవాలు

పోటెత్తిన యాత్రికులు.. ఆలయాలు కిటకిట

ఇబ్బందులు లేకుండా అధికారుల ఏర్పాట్లు


ప్రజాశక్తి - ముసునూరు

మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని బలివే గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం కళ్యాణం రోజున సుమారు లక్ష మందికి పైగా భక్తులు వచ్చారని ఆలయ ఇఒ టి.విశ్వేశరరావు తెలిపారు. తెల్లవారుజామునా రెండు గంటల నుంచే తమ్మిలేరు స్నానాలు (జల్లు స్నానాలు) ఆచరించి అభిషేకాల కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు దర్శనార్థం విచ్చేశారు. నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి, మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, సర్పంచి రావు ప్రవీణ సుధాకర్ దర్శనం చేసుకున్నారు. డిఎస్పి ఇ.అశోక్కుమార్గౌడ్, సిఐ ఆర్.అంకబాబు, ఎస్ఐ ఎం.కుటుంబరావు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. తహశీల్దార్ దాసరి సుధ, ఎంపి డిఒ జి.రాణి తమ సిబ్బందితో పాటు పర్యవేక్షణ చేపట్టి భక్తులకు ఇబ్బందులు లేకుండా చూశారు. పలువురు ప్రసాదం, వాటర్ప్యాకెట్లు వితరణ చేశారు.

మండవల్లి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పుష్కరానికి ఒకసారి మాత్రమే వచ్చే ఈ మహా శివరాత్రికి గొప్ప విశిష్టత ఉండడంతో ఎన్నడూ లేని విధంగా భక్తులు శివాలయాలకు చేరుకోవడంతో శివాలయాలు ఈ సంవత్సరం ప్రత్యేకత సంతరించుకున్నాయి. కమిటీ సభ్యులు అమర్చిన విద్యుత్ దీప కాంతులతో శివాలయాలు శోభాయమానంగా భక్తులకు కనువిందు చేశాయి. దీంతో మండవల్లి, పుట్టచెరువు, భైరవపట్నం, అగ్రహారం, చావలపాడులోని శివాలయాలకు భక్తులు పోటెత్తడంతో జన సందోహంతో శివాలయాలు నిండిపోయాయి. ఏలూరు రోడ్డులో ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శివ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. చావలపాడు సర్పంచి తలారి అన్నిబాబు, ధనలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని వివాహ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శనివారం ఉదయం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీ కరించారు.

కైకలూరు : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని గోకర్ణపురంలోని శ్రీ గోకర్ణేశ్వరస్వామి, కైకలూరు శ్రీ శ్యామలాంబ అమ్మవారి ఆలయంలో ఉన్న రామేశ్వర, రామలింగేశ్వర స్వామి, ఆటపాకలోని శ్రీ కనకలింగేశ్వరస్వామి, పల్లేవాడలోని భీమేశ్వరస్వామి, ఆలపాడులోని సోమేశ్వర స్వామి, వర హాపట్నం, భుజబలపట్నం, దొడ్డిపట్ల తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు చేశారు.

గణపవరం : మహాశివరాత్రి వేడుకులు మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు.



బలివే వద్ద యాత్రికులు

గణపవరం, సరిపల్లి, పిప్పర, మొయ్యేరు, జల్లికాకినాడ, ముప్పర్తిపాడు, కేశవరం పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు దైవ దర్శనం చేసుకున్నారు. గణపవరం శివాలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయం వద్ద భక్తులకు అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఛైర్మన్ కూసంపూడి రామకృష్ణంరాజు, ఇఒ శ్రీధర్ తెలిపారు.

తాడువాయి ఉత్సవాలకు యాత్రికుల రద్దీ

జంగారెడ్డిగూడెం : మండలంలోని తాడువాయిలో వైభవంగా నిర్వహిస్తున్న శివరాత్రి ఉత్సవాలకు యాత్రికులు వేల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో తాడువాయి శివారులో పురాతన శివాలయానికి అధికసంఖ్యలో యాత్రికులు తరలి వచ్చారు. సుమారు పది వేల మంది యాత్రికులు ఉత్సవాలకు తరలి వచ్చారని ఉత్సవ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు యాత్రికులకు తాగునీరు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలందించారు. మహాశివరాత్రి నేపథ్యంలో తాడువాయిలో ఐదు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాహన రాకపోకలకు అంతరాయం

తాడువాయిలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలకు వందల సంఖ్యలో వాహనాలు తరలివచ్చాయి. ఆలయానికి దగ్గరలో వాహనాలు అధిక సంఖ్యలో చేరడం వల్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని పలువురు పేర్కొం టున్నారు. ఆలయ సమీపానికి రాకముందే వాహనాల రద్దీని నియంత్రించాలని యాత్రికులు కోరుతున్నారు.

డివైఎఫ్ఐ, వ్యకాస ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

మహాశివరాత్రి సందర్భంగా డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు ఉచితంగా మజ్జిగ, తాగునీటిని అందించడం అభినందనీయమని డివైఎఫ్ఐ పూర్వ నాయకులు పసల సూర్యారావు అన్నారు. శనివారం మండలంలోని తాడువాయి శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో పటాన్ మస్తాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, తాగు నీరు పంపిణీ కేంద్రాన్ని డివైఎఫ్ఐ పూర్వ నాయకులు పసల సూర్యారావు ప్రారంభించారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ తాడువాయిలో జరుగుతున్న భద్రకాళీ సమేత విశ్వేశ్వర స్వామి శివరాత్రి కల్యాణ మహోత్సవానికి తరలి వస్తున్న వేలాది మంది యాత్రికులకు డివైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే ఐదు రోజులు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అధికారులు స్పందించి ప్రధాన రహదారి నుండి ఆలయ ప్రాంగణం వరకు కనీసం మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు దంపతులకు ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు ఘన స్వాగతం పలికారు. కైకలూరు చిన్నారుల కూచిపూడి భరతనాట్యం, సానా రుద్రవరం, కలిదిండి శ్రీ వాసవీ మహిళా, ఏలూరుపాడు శ్రీ లలితా మహిళా కోలాట బృందం చేసిన మురళీ కోలాటం యాత్రికులను ఆకట్టుకున్నాయి. లోడిదలంక, నెహ్రూ నగర్, అంజనాపురం, పడమటి పాలెం, గొల్లగూడెం గ్రామాల నుంచి ప్రభలు డప్పు వాయిద్యాలు, యువత నృత్యాల నడుమ ఆలయానికి తరలి వెళ్లాయి. ఆలయ ప్రాంగణంలో అన్నదాన సత్రాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ మణి కుమార్ ట్రాఫిక్కి ఎటువంటి అంతరాయం లేకుండా, ఆలయ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పర్యవేక్షించారు. మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ, కలిదిండి సర్పంచి మారుతీ ప్రసన్న స్వామివారిని దర్శించుకున్నారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలో ప్రసిద్ధి చెందిన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయానికి శనివారం వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైసిపి అరాచకాలను ఎండగట్టాలి : టిడిపి

జిల్లావ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనను పోలీసులు అడుగడుగున అడ్డుకోవడం, కార్యకర్తలపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండిస్తూ టిడిపి నేతలు అంబేద్కర్ చిత్రపటానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని శనివారం నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి వినతిని అందించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో అడుగడుగునా రాజ్యాంగ ఉల్లంఘన, చట్టాల ధిక్కరణ జరుగుతోందన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసుల చేత వాటికి విఘాతం కల్గించేలా చేస్తున్నారన్నారు. టిడిపి మున్సిపల్ కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ ప్రజల నుంచి టిడిపికి వస్తున్న ఆదరణ చూడలేక ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

టి.నరసాపురం : రాష్ట్రంలో వైసిపి నియంత పాలనకు చమరగీతం పాడాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అనపర్తిలో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ మండలంలోని మక్కినవారిగూడెంలో టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శీలం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాలో చంద్రబాబు రోడ్ షోను అడ్డుకోవడం దారుణమన్నారు. చంద్రబాబు సభలకు వస్తున్న జనసందోహం చూసి ఓర్వలేక సిఎం జగన్ పోలీసులు చేత అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలిపారు.

చాట్రాయి : ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి, ప్రతిపక్షాల గొంతు నొక్కే సిఎం జగన్ నియంతృత్వ పోకడలు మన రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ చనుబండ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు శనివారం ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి, నల్ల జెండాలు పట్టుకుని, కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసనను తెలియజేశారు.

చింతలపూడి : టిడిపికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఓర్వలేకే చద్రబాబు పర్యటనను అడ్డుకుంటున్నారని ఆ పార్టీ చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కోంద్రు దేవా, ఎస్సి సెల్ టౌన్ అధ్యక్షులు కర్లపూడి రాజారత్నం అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిని అందించి ఆందోళన చేపట్టారు.

కైకలూరు :టిడిపి అధినేత చంద్రబాబుపై కేసులు నమోదు చేయడం, అనపర్తిలో పర్యటనను అడ్డుకోవడం దారుణమని ఆ పార్టీ నాయకులు అన్నారు. కైకలూరు తాలూకా సెంటర్లలో టిడిపి మండల అధ్యక్షుడు పెనుమత్స త్రినాధరాజు ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్సి కమిలి విఠల్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి పైడిమరి మాల్యాద్రి, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వహణ కార్యదర్శి పూల రామచంద్రరావు, జెడ్పిటిసి మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జానీ పాల్గొన్నారు.